క్లుప్తంగా

గోదావరి గట్టు వెంబడి రెయిలింగ్ ధ్వంసం



గోదావరిగట్టు వెంబడి కానరాని రెయిలింగ్

నరసాపురం: పట్టణంలో గోదావరి గట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధ్వంసమైంది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో ఈ రెయిలింగ్‌ను గట్టు వెంబడి నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధ్వసమైయ్యింది. గట్టు వెంబడి నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వసమైయ్యింది. కొంతమేర రెయిలింగ్ చోరీకి కూడా గురవుతోంది. దీంతో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

పాలకొల్లు సెంట్రల్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. ఆదివారం క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న 13 మందికి కంటి చికిత్సలు చేయించామన్నారు. సుమారు రూ. 60 వేల వ్యయంతో చికిత్సలు చేయించామని స్పష్టం చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సహాయ సహకారాలు అందించడంలో వాకర్స్ క్లబ్ తన వంతు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మానెం బసవరాజు, జవ్వాజి కళ్యాణ్, కర్రి కిరణ్, మాగం శ్రీధర్, ఎండీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వసుధ ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు మాట్లాడుతూ మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన అంగర గంగరాజు, చల్లాబత్తుల కోట గంగరాజు, కూర్మా లక్ష్మీలకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున ముప్పై వేలు ఆర్థిక సహాయం అందజేశామని వివరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజుకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కట్టి ముక్కల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాబ్జీకి శ్రీరంగనాథరాజు పరామర్శ



డాక్టర్ బాబ్జీని పరామర్శిస్తున్న శ్రీరంగనాథరాజు

పాలకొల్లు సెంట్రల్: మాజీ శాసనసభ్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జీ) కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. బాబ్జి కుమారుడు అంజిబాబు మృతి వార్త తెలుసుకున్న శ్రీరంగనాథరాజు పరామర్శించి తన సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ వంక రవీంద్ర, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌లు పరామర్శించగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఫోన్‌లో పరామర్శించారు. అంజిబాబు అంత్యక్రియలు సోమవారం చేయనున్నట్లు బంధువులు తెలిపారు.

షార్ట్ ఫిల్మ్ బృందానికి అభినందనలు

కాళ్ల: ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ ఐక్య నేషనల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ చిత్రీకరించిన 'నీకోసం' షార్ట్ ఫిల్మ్ బృందాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారు. పెదఅమీరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం చిత్ర బృందం కలిసి ఫిల్మ్ చూశారు.

ఎమ్మెల్సీ పరామర్శలు

వీరవాసరం: మండలం చింతలకోటి గరువు మాజీ సొసైటీ చైర్మన్ కటికిరెడ్డి రాంబాబు భార్య సూర్యకుమారి మరణించడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ, రాష్ట్ర శెట్టిబలిజ విభాగ అధ్యక్షుడు కవురు శ్రీనివాస్ ఆదివారం వారి స్వగృహానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట దాసరి మాణిక్యాలరావు, కె.శ్రీనివాస్, కె. సత్యనారాయణ ఉన్నారు.

వాతావరణ కార్యాలయం శిథిలం

- స్థలం కోసం రెవెన్యూ శాఖకు లేఖ
- ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ప్రతిపాదనలు



అసౌకర్యాల మధ్య కొనసాగుతున్న నరసాపురం భారత వాతావరణ శాఖ కార్యాలయం



చుట్టూ చెట్ల మధ్య ఉన్న ఆటోమేటిక్ వెదర్ స్టేషన్

నరసాపురం: నరసాపురంలోని భారత వాతావరణశాఖ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. అరకొర సౌకర్యాల మధ్య ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన వాతావరణ సమాచారం సేకరించే ఈ కేంద్రంలో వసతులు సరిగ్గా లేని కారణంగా, కచ్చితమైన సమాచారం సేకరించడానికి సాంకేతికంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా మొత్తానికి ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ నరసాపురంలోనే ఉంది. తీరప్రాంతం కావడం, తరచూ తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు రావడంతో ముందు ఆలోచనలతో భారత వాతావరణశాఖ ఇక్కడ కార్యాలయాన్ని నిర్మించింది. ఇక్కడ తప్పిస్తే తూర్పు గోదావరిజిల్లా కాకినాడలోను, రాజమండ్రి ఎయిర్‌పోర్ట్‌లో మాత్రమే ఈ తరహా కేంద్రాలు ఉన్నాయి. 1982లో ఇక్కడ వాతావరణ సమాచారం సేకరించేందుకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో భవనం నిర్మించారు. 1984లో స్థానికంగా వాతావరణశాఖ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి అదే భవనంలో వాతావరణశాఖ కార్యాలయం పని చేస్తుంది.

సమాచారం కోసం తిప్పలు

వాతావరణశాఖ భవనం హౌసింగ్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం పైన గదిలో కొనసాగుతుంది. ఈ భవనం శిథిలావస్థకు చేరింది. జిల్లాకు సంబంధించి ప్రధానమైన స్టేషన్. వర్షపాతం వివరాలతో పాటు, తుఫాన్‌ల తీవ్రత, ఉష్ణోగ్రతలు, గాలివేగం, గాలిలో తేమశాతం వంటి వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. సమాచారాన్ని విశాఖపట్టణం, పూనె, హైదరాబాద్ వాతావరణశాఖ కార్యాలయాలకు చేరవేస్తారు. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ కూడా ఈ కార్యాలయం పక్కనే ఉంది. అయితే విలువైన ఈ పరికరాలు ఉన్న ప్రాంతం చుట్టూ చెట్లు పెరిగిపోయాయి. కార్యాలయం కూడా శిథిలావస్థలో ఉండటంతో కచ్చిత సమాచారాన్ని రాబట్టడానికి అధికారులు తిప్పలు పడాల్సి వస్తోంది.

పెండింగ్‌లో అభివృద్ధి ప్రతిపాదనలు

ఎకరం స్థలంలో అధునాతన స్టేషన్‌ను, సిబ్బందికి క్వార్టర్స్‌ను నిర్మించాలనే ప్రతిపాదన దాదాపు 14 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉంది. ఎకరం స్థలం కోసం వాతావరణ శాఖ 2011లో అప్పటి ఉమ్మడి పశ్చిమ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసింది. అయితే రూరల్ ప్రాంతంలో స్థలం ఇస్తామనడంతో అప్పటి నుంచి ఈ ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుతం కార్యాలయ భవనం ఉన్న పక్కనే సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న 15 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని మూడేళ్ల క్రితం వాతావరణశాఖ కోరింది. ఈ మేరకు సబ్‌కలెక్టర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. స్థలం మంజూరు చేస్తే క్వార్టర్స్‌ను మినహాయించి, అధునాతనంగా మూడంతస్తుల్లో వాతావరణశాఖ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తామని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. కానీ ఈ ఫైల్ కూడా పెండింగ్‌లోనే ఉంది. దీంతో ఎంతో కీలక సమాచారం అందించే వాతావరణ శాఖ కార్యాలయం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ అరకొర వసతుల మధ్య కొనసాగుతుంది.

కృష్ణబలిజ ఫెడరేషన్ నిధుల విడుదలకు కృషి

పాలకొల్లు సెంట్రల్: కృష్ణబలిజ పూసల ఫెడరేషన్ సంఘానికి ప్రభుత్వం నుంచి రావాలఇసన నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని కృష్ణబలిజ పూసల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా త్రిమూర్తులు అన్నారు. ఆదివారం స్థానిక పూలపల్లి కృష్ణ బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్రిమూర్తులును సన్మానించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ పూలపల్లిలో సంఘ సభ్యులు గంటా నరసింహమూర్తి ఆధ్వర్యంలో గత 45 సంవత్సరాలుగా క్రీడల పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంటా వెంకన్న, పట్టణ అధ్యక్షులు ముదరకోల సత్యనారాయణ, బక్కా ఆదిబాబు, గంటా నాగరాజు, గంటా సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

షాపుల అద్దె బకాయిలు చెల్లించకుంటే తాళాలు

నరసాపురం: పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో షాపులు అద్దెకు తీసుకున్న లీజుదారులు బకాయిలు చెల్లించకుంటే సదరు షాపులకు తాళాలు వేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో చాలా షాపులకు సంబంధించి అద్దెదారులు నెలల తరబడి బకాయిలు ఉన్నాయన్నారు. అద్దెలు సకాలంలో జమకాక పోవడంతో మున్సిపాలిటీ ఆదాయానికి నష్టం వస్తుందని పేర్కొన్నారు. లీజుదారులు స్పందించి వెంటనే అద్దె బకాయిలు చెల్లించాలని కోరారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



రాజుగారితోట గ్రామ కమిటీని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసాపురం రూరల్: పార్టీలో అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజుగారితోట వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నియామక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అందరూ ఐకమత్యంగా పనిచేయాలన్నారు. అనంతరం రాజుగారితోట నూతన గ్రామ కమిటీనీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంజేటి సుగుణరావు, ప్రధాన కార్యదర్శులుగా కత్తిమండ కిషోర్‌కుమార్, ఖండవల్లి నాగేశ్వరరావు, మంతెన శివకృష్ణ, కార్యదర్శులుగా ఈదా సువర్ణరాజు, రాయుడు రెడ్డమ్మ, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఖండవల్లి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా ములపర్తి సత్యానందం, ఇంజేటి సుధీర్, కత్తిమండ కిషోర్‌బాబు, జిల్లెళ్ల మేషక్, కత్తిమండ వినోద్‌కుమార్, బీర సునీల్, బందెల ప్రభుకుమార్, వద్దనపు సురేష్‌బాబులు ఎన్నికయ్యారు. యూత్ గ్రామ అధ్యక్షుడిగా చెల్లం షాలెంరాజు, రైతు విభాగం అధ్యక్షుడిగా రాయుడు వెంకట ముత్యాలరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడుగా కత్తిమండ సుదర్శనరావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా రాయుడు అగ్గిరాముడు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా యల్లా అనురాధ, మేథావుల ఫోరమ్ అధ్యక్షుడిగా బొడ్డుపల్లి ప్రదీ లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉంగరాల రమేష్‌నాయుడు, దొంగ మురళీకృష్ణ, దొండపాటి వెంకట్, పులపర్తి ప్రతాప్, దొంగ మోహనరావు, మైలాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొలనులా తయారైన బస్టాండ్



బస్టాండ్‌లో చెరువులా ఉన్న ప్రయాణికులు కూర్చునే ప్రదేశం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో కొద్దిపాటి వర్షానికే పొట్టి శ్రీరాములు బస్టాండ్ నీట మునుగుతుంది. వర్షం ఏకధాటిగా కురిస్తే మాత్రం బస్టాండ్‌లోకి వెళ్లాలంటే ఈత కొట్టాల్సిందేనని ప్రయాణికులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి 7 గంటలకు కురిసిన వర్షానికి బస్టాండ్ జలమయమైంది. కనీసం ప్రయాణికులు కూర్చునే అవకాశం కూడా లేకుండాపోయింది. అలాగే పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్‌కు ఇన్ గేటు బాగానే ఉన్నా అవుట్ గేట్ మాత్రం నీట మునిగిపోతుంది. బస్టాండ్ లోపలకి వెళ్లాలన్నా లోపల ఉన్న వాళ్లు బయటకు రావాలన్నా కదిలే పరిస్థితి కనిపించడం లేదు. వర్షం గట్టిగా కురిస్తే మాత్రం దాదాపు మోకాలు లోతు వరకూ నీరు చేరుకుంటుంది. దానివల్ల ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.

అంతుచిక్కని వాతావ'రణం'



ఆకివీడులో ఆదివారం రాత్రి కురిసిన వర్షం

ఆకివీడు: గత కొన్ని రోజులుగా వాతావరణం అంతుచిక్కడంలేదు. ఆదివారం పగలంతా గ్రీష్మతాపానికి ప్రజలు అల్లాడిపోతుంటే, సాయంత్రం పడిన తుంపర్ల వర్షం కురిసింది. కొద్దిసేపు ఊపిరి పీల్చుకున్నా, ఉక్కబోత వాతావరణం తప్పడం లేదు. వర్షాకాలం అయినప్పటికీ ఆకివీడు ప్రాంతంలో దుక్కి వర్షం కురిసిన దాఖలాలు లేవు. చిరుజల్లులు, ఈదురుగాలులతో పాటు ఆకాశం మేఘావృత్తమై నిట్టూర్పులతో చెక్కేస్తుంది. పగలంతా ఉక్కబోత వాతావరణం, సాయంత్రానికి చల్లబడి, చిరుజల్లులు పడినప్పటికీ ఉక్కబోత వాతావరణం తప్పడంలేదు. దీంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పగలు 30 నుంచి 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతున్నప్పటికీ 35 నుంచి 40 డిగ్రీలను తలపించే విధంగా ఎండలు కాస్తున్నాయి. దీంతో వృద్ధులు, పిల్లలే కాదు, జనమంతా వాతావరణాన్నికి అల్లాడిపోతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పోతున్నారు. దీనికి తోడు అప్పుడప్పుడూ కరెంట్ కోతలతో మరింత ఉక్కిరి బిక్కిరవుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులకు ఇటు ప్రజలతో పాటు అటు చెరువుల్లోని రొయ్యలు, చేపలకు ఆక్సిజన్ అందక వ్యాధులబారిన పడుతున్నాయి. వందలాది ఎకరాల చెరువుల్లోని రొయ్యలు 300 పైబడి కౌంట్‌లో చనిపోతున్నాయి. చెరువుల్లో వదిలిన 15, 20 రోజులకే చనిపోవడంతో రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ఉండి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో పాల్గొని అవకాశాన్ని మరింత మందికి కల్పిద్దామని క్లబ్ జోన్ చైర్మన్ రావూరి నాగరాజు అన్నారు. ఆదివారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో జోన్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్‌లో మరింత మందికి సభ్యత్వం కల్పించి వారికి కూడా సేవ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ జిల్లా గవర్నర్ ఇచ్చిన సభ్యత్వాల టార్గెట్ సాధించినట్లు తెలిపారు. తన పరిధిలో పనిచేస్తున్న గణపవరం, ఉండి, చేబ్రోలు క్లబ్‌లు ఎంతో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు రంగరాజు, గణపవరం క్లబ్ కోశాధికారి మూర్తి, ఉండి క్లబ్ కార్యదర్శి రంగప్రసాదరాజు, డీసీ మెంబర్ కన్నెగంటి రూత్‌కళ, సత్తి బ్రహ్మారెడ్డి, కాగిత మహంకాళి,కలిదిండి సీతారామరాజు, బీ హరనాధరాజు, పాలతీర్థపు నర్సింగరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా... రోడ్ల పనులు సున్నా



ఆకివీడు: పెదకాపవరం శివారు గణపవరం రోడ్డు దుస్థితి



కేజీ రోడ్డులో క్రొవ్విడి రోడ్డు దుస్థితి

ఆకివీడు: రోడ్ల నిర్మాణానికి సెంట్రల్ రోడ్డు ఫండ్(సీఆర్ఎఫ్) నిధులు గత ప్రభుత్వంలో పుష్కలంగా మంజూరు అయినా ఆయా రోడ్లకు మోక్షం లభించడం లేదు. కలవపూడి–గణపవరం(కేజీ రహదారి) రోడ్డు, పెదకాపవరం–కొల్లేరు రోడ్డు అభివృద్ధికి, విస్తరణకు గత ప్రభుత్వంలో కేంద్ర నిధులు రూ. 53 కోట్ల మేర విడుదలయ్యాయి. రెండు రోడ్లకు భూమి పూజ చేసి నిర్మాణ పనులు చేపట్టారు. పెదకాపవరం–క్రొవ్విడి వరకూ పంట కాల్వకు రిటర్నింగ్ వాల్ యుద్ధప్రాతిపదికన నిర్మించారు. సుమారు రూ. 15 కోట్ల వ్యయమైంది. ఇంత వరకూ సంబంధిత కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి బిల్లు చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పాములపర్రు–పెదకాపవరం–కొల్లేరు రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు ఆక్రమణల పనులు చేపట్టినప్పటికీ రోడు విస్తరణ పనులు చేపట్టలేదు.

నరకం చూస్తున్నారు

కేజీ రహదారిలో క్రొవ్విడి వెళ్లే మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. రోడ్డుకు చేర్చి చెరువులు తవ్వివేయడంతో చెరువు ఊట నీరు రోడ్డులోకి వచ్చి, భారీ వాహనాలు దిగిపోతున్నాయి. వేసవిని తలపించే ఎండలు కాస్తున్నా ఈ ప్రాంతంలో రోడ్డు బురదమయంగానే ఉంది. ఆకివీడు నుంచి గణపవరం వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఈ రోడ్డు ఉంది. ద్విచక్ర వాహనాలపై కూడా ప్రయాణించలేని దుస్థితిలో రోడ్డు ఉంది. ఉండి–గణపవరం రోడ్డు కూడా గతుకులతో ఉండటంతో ఈ ప్రాంత ప్రయాణికులు, వ్యాపారులు పెదకాపవరం రోడ్డును ఆశ్రయిస్తున్నారు.

కొల్లేరు రోడ్డు అంతే

పాములపర్రు నుంచి పెదకాపవరం గ్రామం మీదుగా గంటలరాయుడు పేట. కొల్లేరు వెళ్లేందుకు వాహనచోదకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. రోడ్డు విస్తరణకు యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగించినా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో పలు చోట్ల గుంతలు, గుంతలుగా మారింది.

దేవీ శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం



మల్లప్పదిబ్బలో విద్యుద్దీపాలంకరణలో పెద్దింట్లమ్మ ఆలయం



సిద్ధాంతంలో మట్టి విగ్రహాలను తీర్చిదిద్దుతున్న శిల్పి వీరవాసరపు సత్యనారాయణ



నరసాపురం రూరల్:చిట్టవరంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



యడ్లబజారు సెంటర్ శ్రీ కనకదుర్గమ్మ



అమ్మవారి ఉత్సవాలకు ముస్తాబైన మండపం

పెనుగొండ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి పెనుగొండ, ఆచంట మండలాల్లో ఆలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమై అక్టోబరు 2వరకూ కొనసాగనున్నాయి. సోమవారం కలశ పూజలతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ ఆలయంలోని అమ్మవార్లను తొమ్మిది రోజుల పాటు వివిధ దేవతా మూర్తుల రూపాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మల్లప్ప దిబ్బ పెద్దింట్లమ్మ ఆలయం, వడలిలోని పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోనూ, ఆచంట రామేశ్వర స్వామి ఆలయంలోనూ, సిద్ధాంతం దేవీ సెంటర్‌లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. వీటితో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేసి మరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఆయా ప్రాంతాలలో సర్వం సిద్ధం చేశారు.

మట్టి విగ్రహాలకు డిమాండ్

పర్యావరణ కాలుష్యంతో ఇబ్బందులు లేకుండా పర్యవరణ పరిరక్షణే ధ్యేయంగా సిద్ధాంతంకు చెందిన శిల్పి వీరవాసరపు సత్యనారాయణ మట్టి విగ్రహాలు తయారు చేస్తూ పలువురు మన్ననలు పొందుతున్నారు. మూడు దశాబ్దాలకు పైగా మట్టి విగ్రహాలనే తయారు చేసి ఉత్సవాలకు అందిస్తున్నారు. మూడు అడుగుల నుంచి 8 అడుగుల వరకూ విగ్రహాలను మట్టితో తయారు చేస్తారు. విగ్రహాలు తుదిమెరుగులు దిద్దుకుని ఆదివారం సాయంత్రమే చలువ పందిళ్లకు చేరుకొన్నాయి.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందడి మొదలైంది. ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు. కొప్పర్రు, చిట్టవరం, కె.బేతపూడి, చినమైనవానిలంక, సీతారాంపురం, లక్ష్మణేశ్వరం, సారవ, తూర్పుతాళ్లు, మల్లవరంలంక, పసలదీవి గ్రామాల్లో ఉన్న దుర్గాదేవి ఆలయాల వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. వేములదీవి, సర్దుకొడప, చినలంక ప్రాంతాల్లో కూడా ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకున్నారు. చిట్టవరంలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో సోమవారం ఉదయం గ్రామానికి చెందిన పలువురు దంపతులు పూజల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: నేటి నుంచి దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవ కమిటీల సభ్యులు వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసే అమ్మవార్ల విగ్రహాల కోసం చలువ పందిళ్లను సిద్ధం చేశారు. పట్టణంలో పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయం, యడ్లబజారు శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, చినగోపురం వీధిలో శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ రెండు ఆలయాలు, కల్యాణ మండపంలో రోజుకో అలంకరణ చొప్పున అమ్మవార్లను తీర్చిదిద్దనున్నారు. ఈ ఉత్సవాల్లో అమ్మవార్ల అలంకరణలు 11 రోజులు పాటు చేయనున్నారు.

ఘనంగా గురజాడ జయంతి



గ్రంథాలయంలో గురజాడ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తెలుగు కవిత్వానికి, సాహిత్యానికి మార్గదర్శకుడు గురజాడ వెంకట అప్పారావు అని గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి అన్నారు. ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గురజాడ జయంతి కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ భాషావేత్త, తెలుగు సాహిత్యంలో వాడుక భాషను ప్రవేశపెట్టి చిరస్మరణీయమైన రచనలు చేశారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, భవానీ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనుగొండ: నియోజకవర్గంలో 79 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.35,88,576 చెక్కులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పంపిణీ చేశారు. ఆదివారం పోడూరు మండలం కొమ్ము చిక్కాలలో ఎమ్మెల్యే పితాని నివాసంలో జరిగిన కార్యక్రమంలో వీటిని లబ్ధిదారులకు అందించారు.ఆయా మండలాలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నా రు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉద యం 10.30గంటల నుంచి అందించాలని కోరారు.